### సినీనటుడు సుమన్

# కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది

షాద్‌నగర్ టౌన్, జనవరి 5 : ఆత్మరక్షణకు కరాటే, కుంగ్‌ఫూ ఒక ఆయుధమని సినీ నటుడు సుమన్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని కుంట్లరామిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో యాదవ బుడోకాన్ కరాటే క్లబ్ ఇంటర్నేషనల్, రేజింగ్ సన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్, సుమన్ చిల్డ్రన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ మల్లేశ్‌యాదవ్ మెమోరియల్ నిర్వాహకులు, మాస్టర్లు సాయినాథ్ యాదవ్, ఉత్తేజ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 38వ ఆల్ ఇండియా లెవల్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కరాటే అందరికీ ధైర్యానిస్తుందని, కరాటే, కుంగ్‌ఫూతో క్రమశిక్షణతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అంతకుముందు సినీనటుడు సుమన్, న్యాయవాది మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నందారం అశోక్‌యాదవ్‌ను మాస్టర్ సాయినాథ్‌యాదవ్ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో సినీనటుడు సుమన్


బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును వేజ్ బోర్డు మాజీ చైర్మన్ పులిమామిడి నారాయణ ఆదివారం బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికార పార్టీ తప్పులపై, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల తరఫున పోరాడాలని, భవిష్యత్తులో వాటిని మరింత ఉధృతం చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చినట్లు నారాయణ వివరించారు.
– చేవెళ్లటౌన్, జనవరి 5



### నాగిళ్ల జగన్‌కు పండుగ సాయన్న రాష్ట్ర స్థాయి పురస్కారం



ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన బీసీ కులాల ఐక్యవేదిక యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల జగన్‌కు పండుగ సాయన్న రాష్ట్ర స్థాయి సేవా పురస్కారం వరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు శివరామచంద్రన్ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ నేతలు బ్రహ్మయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, లక్ష్మీపతి, సంపత్, నర్సింహారావు తదితరులు ఉన్నారు.
-ఆమనగల్లు, జనవరి 5



### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మండలంలోని బండలేమూరు గ్రామంలో ఆదివారం ఉదయం 5కే, 2కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలు, సిగరెట్, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ రన్‌లో మంచాల సీఐ మధు, గ్రామస్తులు శ్రీనూ నాయక్, జనార్దన్ నాయక్, మధుసూదన్‌రెడ్డి, మల్లేశ్, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.
-మంచాల, జనవరి 5

### అలరించిన శ్రీకావ్య

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాల ప్రత్యేక కార్యక్రమం కళాకారులు చేసిన నృత్యాలతో ఆడంబరంగా సాగింది. బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కృషి నృత్య అకాడమీ నుంచి 16 మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా చిన్నారి పడికి శ్రీకావ్య చేసిన కూచిపూడి నృత్యం చూపరులను అలరించింది. కార్యక్రమంలో గురువులు కాంతారావు, నటసాయితో పాటు చిన్నారి కళాకారులు కావ్య, లాస్య, దేదీప్య, నెహృత, శ్రీశిఖ తదితరులు పాల్గొన్నారు.



# ఒక్కసారిగా భద్రత దిగజారి..

## మొదటి ఎనిమిది నెలల్లో దూసుకుపోయిన నేరాలు!

- బేసిక్ పోలీసింగ్‌ను వదిలేయడంతో పెరిగిన ఆగడాలు
- కునారిల్లుతున్న పెట్రోలింగ్ వ్యవస్థ
- రాత్రి వేళల్లో రెచ్చిపోయిన నేరగాళ్లు
- ఇబ్బందుల్లో నగర పోలీస్ సిబ్బంది
- విమర్శలతో తేరుకున్న ప్రభుత్వం - సీపీల బదిలీ
- మూడు నెలల్లో దారిలోకి.. సిటీ పోలీసింగ్

సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతేడాది మొదటి ఎనిమిది నెలల్లోనే భారీగా నేరాలు నమోదయ్యాయి. ఉన్నతాధికారులు సిటీ పోలీసింగ్‌ను గాలికి ఒదిలేయడం, తమ సొంత ఆలోచనలను సిబ్బందిపై రుద్దేందుకు ప్రయత్నించడంతో క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనిచేయకుండా చేతులెత్తేశారు. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక ఏకంగా కొందరు మూకుమ్మడి సెలవులు పెట్టాలని, మరి కొందరు ఒక్కసారి గా ఆందోళనకు దిగాలని, ఇంకా కొందరు అవసరమైనప్పుడు శాంతిభద్రతల పరిరక్షణను గాలి కి ఒదిలేస్తే, అందరూ దిగొస్తారనే ఆలోచనలు సైతం చేసినట్లు పోలీసు విభాగంలో చర్చ జరుగుతున్నది. గతేడాది హైదరాబాద్‌లో 41 శాతం నేరాలు పెరిగాయి. సురక్షితమైన నగరంలో ఒక్కసారిగా పరిస్థితులు ఎందుకు ఇలా దిగజారాయి అనే అంశాలను సిటీ పోలీసింగ్‌లో చర్చించుకుంటున్నారు. నగరంలో 2023లో 25488 కేసులు నమోదు కాగా, 2024లో 35944 కేసు లు నమోదయ్యాయి. 41 శాతం నేరాలు పెరిగాయి. ఆ పెరుగుదల విషయాన్ని విశ్లేషిస్తే గతేడాది జనవరి నుంచి ఆగస్టు వరకు మొదటి ఎనిమిది నెలల్లో ఎక్కువగా నమోదయ్యాయి. హైదరాబాద్‌లో హత్యలు, దొంగతనాలు, దోపిడీలు పెరిగిపోతుండటంతో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రాష్ట్ర రాజధాని బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీశారంటూ అటూ ప్రతిక్షం, ప్రజలు గొంతెత్తడంతో ప్రభుత్వం అప్రమత్తమై, సిటీ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన పోలీస్ కమిషనర్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో సిటీపై పూర్తి పట్టున్న సీనియర్ ఐపీఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అధికారి బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన పరిస్థితిని గాడిలో పెట్టారని నగర పోలీసులు చర్చించుకుంటున్నారు.



### గాలికి పెట్రోలింగ్ వ్యవస్థ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత హైదరాబాద్ సీపీగా తమకు అనుకూలంగా ఉండే సీనియర్ ఐపీఎస్‌ను నియమించారు. ఆయన రావడంతోనే సిటీ పోలీసింగ్‌లో ప్రక్షాళన మొదలుపెట్టారు. ఆ ప్రక్షాళన ఏకంగా పోలీస్‌స్టేషన్ల సిబ్బందిని మార్చడంతో పాటు అప్పటి వరకు పనిచేసి అనుమానించే పరిస్థితులు ఉండేవి. ఆయనకు నమ్మకమైన కొందరు ఐపీఎస్‌లతో ప్రక్షాళనా పరమైన విషయాలు చర్చిస్తూ బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టలేదనే విమర్శలున్నాయి. పెట్రోలింగ్ వ్యవస్థలో ఎన్ని వాహనాలున్నాయి? ఎన్ని పని చేస్తున్నాయి? రాత్రి వేళల్లో సిబ్బంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు? అనే అంశాలను పక్కన పెట్టేశారు. దీంతో సుమారు 210 పెట్రోలింగ్ వాహనాలు నిత్యం తిరుగాల్సిన చోట, 60 శాతం మాత్రమే పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నా ఆ విషయంపై దృష్టి పెట్టలేదనే విమర్శలున్నాయి. అసలు ఈ పెట్రోలింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తోంది? నిత్యం పర్యవేక్షించే టెక్నాలజీని పక్కన పెట్టేయగా, సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు, హత్యలు జరిగినా సమయానికి పెట్రోలింగ్ వాహనాలు ఘటనా స్థలికి చేరుకోలేని పరిస్థితి నెలకొంది. గుడి మల్కాపూర్‌లో సెల్‌ఫోన్ స్నాచర్లు హత్యకు కూడా పాల్పడటంతో ఆ సమయంలో పెట్రోలింగ్ వాహనం సరైన సమయానికి రాలేదని, అప్పటి ఉన్నతాధికారులు సైతం అసహనం వ్యక్తం చేశారు. పోలీసు యంత్రాంగం ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ, ఆ తరువాత ఎవరేమి చేసుకుంటే మాకేంటి? అన్న చందంగా వ్యవస్థను మార్చేశారు. దీంతో సౌత్, సౌత్ వెస్ట్, వెస్ట్, సౌత్ ఈస్ట్, ఈస్ట్ ఇలా అన్ని జోన్లలో పరిస్థితి చేయి దాటి పోయింది. రాత్రి పూట గస్తీని గాలికి ఒదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో నేరాలు భారీగా జరిగాయి. రౌడీ షీటర్ల హత్యలు, సెల్‌ఫోన్ స్నాచింగులు పెరిగాయి. ఎందుకు పరిస్థితి చేయి దాటిపోయిందో అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారనే విమర్శలు రావడం, దీంతో వాటిని అధిగమించేందుకు ఏకంగా డెకాయ్ ఆపరేషన్లు చేసి నేరస్థులపై కాల్పులు చేశారు.

### మూడు నెలల్లో గాడిలో పడింది..!

హైదరాబాద్‌లో భారీగా పెరిగిపోతున్న క్రైమ్‌తో ప్రభుత్వం కూడా ఆందోళనకు గురయ్యింది. సెప్టెంబర్ నెలలో వినాయక చవితి వస్తుండటం, నిమజ్జనోత్సవం వైభవంగా హైదరాబాద్‌లో జరుగుతుంది. ఇదే నగర పోలీసింగ్‌లో కీలక ఘట్టం. ఆ సమయంలో అప్పటి వరకు ఉన్నతాధికారుల వ్యవహారంపై కోపంగా ఉన్న సిటీ పోలీస్ సిబ్బంది అసలు సమయంలో చేతులెత్తేస్తే శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయని ప్రభుత్వం గుర్తించింది. వెంటనే హైదరాబాద్ పోలీసింగ్‌ను గాడిలో పెట్టేందుకు గతంలో సీపీగా పనిచేసి ఏసీబీ బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన డీజీ సీవీ ఆనంద్‌కు హైదరాబాద్ పగ్గాలు మరోసారి అప్పగించారు. సిటీ పోలీసింగ్‌పై పూర్తి పట్టున్న ఆయన బాధ్యతలు చేపట్టగానే వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తూ, ఎందుకు నేరాలు పెరుగుతున్నాయని క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో పనిచేసిన అధికారులు ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాలలో పనిచేసిన వారు హైదరాబాద్‌కు బదిలీలపై వచ్చారు. హైదరాబాద్ పోలీసింగ్‌పై వారికి సరైన అవగాహన లేదని గుర్తించారు. జోన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ ఎక్కడక్కడ లోపాలున్నాయని గుర్తించి వాటిని సరిచేస్తూ పనిచేస్తున్న సిబ్బందికి సిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పిస్తూ, మూడు నెలలుగా సిటీ పోలీసింగ్‌ను గాడిలో పెడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే పెట్రోలింగ్ వ్యవస్థను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ వాటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నేరాలు చివరి మూడు నెలలు తగ్గుముఖం పడుతూ వచ్చాయి. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది సిటీకి బదిలీపై రావడం, వారికి సిటీ పోలీసింగ్‌పై పూర్తి అవగాహన లేకపోవడంతో కొద్దిగా 2024లో నేరాలు పెరిగాయని సిటీ పోలీసింగ్ వార్షిక నివేదిక విడుదల సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ వెల్లడించిన విషయం తెలిసిందే.

# రియల్ ఎస్టేట్‌పై హైడ్రా ఎఫెక్ట్

సైబర్‌సిటీపై ప్రభావం

### కొత్త ఇండ్ల నిర్మాణాలు లేక.. తగ్గిన ఎల్ టీఎం విద్యుత్ కనెక్షన్లు

సిటీబ్యూరో: ఐటీ కారిడార్ కేంద్రమైన సైబర్‌సిటీపై హైడ్రా ఎఫెక్ట్ పడింది. అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాలంటూ హైడ్రా కూల్చివేతలతో దడ పుట్టించడంతో సైబర్ సిటీతో పాటు ఎక్కడైతే చెరువులు తదితర జల వనరులు ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా హైడ్రా వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ మందగించింది. దీంతో కొత్త నిర్మాణాలే లేకుండా పోయాయి. ఒకవేళ కొన్ని చోట్ల నిర్మాణాలు మొదలుపెట్టినా హైడ్రా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న భయంతో కొనుగోలుదారులు అటువైపు చూడడమే లేదని తెలుస్తున్నది. దీంతో కొత్త ఎల్‌టీఎం కనెక్షన్లు తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి. 2024 నవంబర్ వరకు ఉన్న గణాంకాలను 2023తో పోల్చి చూస్తే గ్రేటర్‌లోని మొత్తం పది సర్కిళ్లలో ఎల్‌టీఎం కనెక్షన్ల సంఖ్య స్వల్పంగా పెరిగినప్పటికీ.. అందులో ఐదింటిలో తగ్గాయి. బంజారాహిల్స్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, సైబర్‌సిటీలో తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్, మేడ్చల్, సంగారెడ్డిలలో పెరుగుదల కనిపిస్తున్నది. నాలుగు మీటర్లు దాటితే లో టెన్షన్ మల్టీపుల్ మీటర్లు(ఎల్‌టీఎం)కింద టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ కనెక్షన్లు జారీ చేస్తుంది. ప్యానల్ బోర్డు ఏర్పాటు చేసి మీటర్లు బిగిస్తుంది. ఈ కనెక్షన్లు 2023లో 12,263 జారీ అవ్వగా, 2024లో 12,537 జారీ అయ్యాయి.

### హైడ్రానే కారణం..

సిటీ రియాల్టీ 2024లో స్తబ్దుగా ఉండడానికి హైడ్రా ప్రధాన కారణంగా రియల్ రంగ నిపుణులు చెబుతున్నారు. జూలై వరకు ఎన్నికల మూడ్‌లో ఉన్న నేపథ్యంలో ఒక్కసారిగా హైడ్రా వచ్చి రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం చూపిందని వారంటున్నారు. ప్రధానంగా హైడ్రా చెరువుల ఆక్రమణలంటూ కూల్చివేతలలో దూకుడుగా వ్యవహరించిన క్రమంలో ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ పడిపోయింది. ఈ క్రమంలో కొత్తగా కొనుగోలుదారులు రాకపోవడం, నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడం, కొత్త నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మరోవైపు జీడీపీ వృద్ధి రేటు కూడా సుమారుగా 3 శాతానికి తగ్గింది. దీంతో కొత్త ఇండ్ల నిర్మాణాలు తగ్గిపోయి మీటర్ కనెక్షన్లు తీసుకోలేదని తెలుస్తున్నది. 2022 డిసెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు బంజారాహిల్స్‌లో 225 ఎల్‌టీఎం కనెక్షన్లు ఉంటే 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు 161 ఉన్నాయి. అదే క్రమంలో రాజేంద్రనగర్‌లో 924 ఉంటే 916 ఉండగా, సైబర్‌సిటీలో1638 ఉంటే 1552 ఉన్నాయి. సరూర్‌నగర్‌లో 2132 ఉంటే 1965కు తగ్గాయి.

### ఎల్ టీఎం కనెక్షన్ల సంఖ్య:



| సర్కిళ్లు | 2022 డిసెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు | 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు |
|---|---|---|
| సైబర్ సిటీ | 1638 | 1552 |
| బంజారాహిల్స్ | 225 | 161 |
| సెంట్రల్ | 723 | 743 |
| సౌత్ | 845 | 872 |
| మేడ్చల్ | 2040 | 2399 |
| రాజేంద్రనగర్ | 924 | 916 |
| సరూర్‌నగర్ | 2132 | 1985 |
| సికింద్రాబాద్ | 695 | 700 |
| సంగారెడ్డి | 1366 | 1639 |



### హెచ్‌సీయూలో 'మిల్లెట్-ఉతోపియా 2025'

ఆహార భద్రత, పోషకాహారం, శక్తి, పర్యావరణ సుస్థిరత కోసం చిరు ధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'మిల్లెట్-ఉతోపియా-2025' ఇంటర్ స్కూల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని 50 పాఠశాలల్లోని 8 నుంచి 10 తరగతులకు చెందిన 1358 మంది విద్యార్థులు పాల్గొని మిల్లెట్స్ ఫర్ ఫుడ్, న్యూట్రిషన్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ థీమ్‌లతో వారు రూపొందించిన అంశాలను ప్రదర్శించారు. పోటీల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వర్సిటీ ప్రొఫెసర్లు ఉన్నారు.
-కొండాపూర్, జనవరి 5

# మేం తప్పులు చేయం.. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నం

### సీఎంఆర్ ఘటనపై మాజీ మంత్రి మల్లారెడ్డి



రజక సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 5: మేం తప్పులు చేయం, విద్యా సంస్థలను స్థాపించి పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌లో ఆదివారం జరిగిన మల్లన్న జాతరకు విచ్చేసిన సందర్భంగా ఆయన సీఎంఆర్ ఘటనపై స్పందిస్తూ సీఎంఆర్ విషయమై మీడియాలో రక రకాలుగా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. తమ విద్యా సంస్థల ద్వారా ఉన్నతంగా సేవలందిస్తున్నామని తెలిపారు. 37 ఏండ్లుగా ఎంతో మందిని ప్రపంచ శ్రేణి ఇంజినీర్లు, డాక్టర్లు, ఫార్మాసిస్టులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 10 వేల బోధన, బోధనేతర సిబ్బందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. మేం ఎప్పుడు తప్పులు చేయం, తెలియకుండా తప్పు జరిగితే కూడా బాధ్యత వహించి, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంత మంది టీఆర్‌పీ రేటింగ్ కోసం సీఎంఆర్ ప్రతిష్టను డ్యామేజ్ చేసేలా వార్తలను ప్రసారం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి సంస్థలు ఎక్కువ కాలం నిలవవని అన్నారు.

#### జీవితం ప్రజా సేవకే అంకితం

తన జీవితం ప్రజా సేవకే అంకితం అని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌లో సొంత నిధులతో నిర్మించిన ముదిరాజ్, రజక సంఘాల భవనాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మంత్రిగా పని చేసే ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని 61 గ్రామాలను ప్రభుత్వ, సొంత నిధులతో అందంగా తీర్చిదిద్దానని తెలిపారు. అన్ని కుల సంఘాలు, 120 ఆలయాల అభివృద్ధికి సొంత నిధులు ఇచ్చినట్టు, రోడ్లను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. తన సేవలను గుర్తించిన నియోజకవర్గ ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ప్రజా సేవలోనే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు సురేశ్ రెడ్డి, రణదీప్ రెడ్డి, రాజిరెడ్డి, జగన్ రెడ్డి, నవీన్ రెడ్డి, నాగరాజు, భద్రారెడ్డి పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఉద్యమ స్ఫూర్తి మణికొండ

### పుస్తక పరిచయ సభలో పలువురు వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు వినయ్‌కుమార్

ఖైరతాబాద్, జనవరి 5: జర్నలిస్టులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని, అందుకు సీనియర్ జర్నలిస్టు మణికొండ చలపతి రావు స్ఫూర్తిగా నిలుస్తారని వక్తలు అభిప్రాయపడ్డారు. సీనియర్ జర్నలిస్టులు అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం – ధృవతార మణికొండ చలపతిరావు' పుస్తక పరిచయ కార్యక్రమం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, నేషనల్ ఎలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే) సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయ్ కుమార్, ఎమెస్కో ప్రచురణాలయం సంపాదకులు జి. వల్లీశ్వర్, ఆకాశదర్శన్ ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్ నేత వోలేటి గోపీచంద్, ఏపీయుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, టైమ్స్ ఆఫ్ ఇండియా లీగల్ ఎడిటర్ ఎం.సాగర్ కుమార్, పికాక్ క్లాసిక్స్ సంపాదకుడు ఏ.గాంధీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్.వేణుగోపాల నాయుడు, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, నందిరాజు రాధాకృష్ణ, తాడి ప్రకాశ్, మిరియాల వెంకట్రావ్ ఫౌండేషన్ ట్రస్టీ పి.రామ్మోహన్ నాయుడులు మణికొండ చలపతి రావుతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. చలపతి రావు దివంగత ప్రధాని జవాహర్ లాల్ నెహ్రూ పెట్టిన నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంపాదకత్వం వహించారన్నారు. నైతిక విలువలు, వృత్తి పట్ల అంకితభావం, పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో రాయడం వంటి లక్షణాలను నేటి జర్నలిస్టులు నేర్చుకోవాలన్నారు.

నేటి పత్రికా యాజమాన్యాలు ప్రభుత్వాలకు పూర్తిగా లొంగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చలపతి రావు నేటి జర్నలిస్టు తరానికి స్ఫూర్తినిస్తారని, ప్రస్తుత సంక్షోభ సమయంలో నేటి జర్నలిస్టులు చలపతిరావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు వేతన బోర్డు రావడం వెనుక చలపతిరావు కృషి ఉందన్నా రు.దివంగత జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలతో ఉన్న పరిచయాన్ని తన సొంతానికి కాకుండా యావత్ జర్నలిస్టుల సంక్షేమానికి పాటు పడ్డారన్నారు. ప్రపంచంలో అత్యధిక పుస్తకాలు చదివిన ప్రముఖుల్లో బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో పాటు మణికొండ చలపతి రావు ఉన్నారని తెలిపారు.



### 'ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి'

చిక్కడపల్లి, జనవరి 5: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి అమలు చేయాలన్నారు. వర్గీకరణ వలన భారత రాజ్యాంగం ప్రకారం, అట్టడుగు వర్గాలకు అందరికీ న్యాయం జరగాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వలన ఒక మాల, మాదిగలే కాకుండా మిగతా అన్ని ఉప కులాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణకు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. దాని అమలుకు కావాల్సిన చర్యలు తీసుకుంటానని చెప్పారని తెలిపారు. వెంటనే ఈ ప్రకియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫోరం సలహాదారుడు పల్లెల వీరస్వామి, డాక్టర్ చీమ శ్రీనివాస్, భరత్ భూషణ్, సామర్ల కిరణ్, నర్సింగరావు, మొలుగు రాజు, రాంబాబు, గడ్డ యాదయ్య, నర్సింగ్ రావు పాల్గొన్నారు.